క్లుప్తంగా

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకపూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణము ఖీనది తీరాన వేంచేసిన వేణుగోలస్వామి ఆలయ ప్రాంగణంలో కొలువైన లక్ష్మీనృంహ హస్వామి గురువారం భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి దర్శనానికి దూరప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

పాచిపెంటలో తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల విశిష్టతను వివరిస్తూ మండల కేంద్రంలో చేపట్టిన ర్యాలీ

పాచిపెంట: ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల విశిష్టతను వివరిస్తూ పాచిపెంట, మంచాడవలస, పెద్దచీపురువలస, కోస్టువలస గ్రామాలలో గ్రామస్తులతో కలిసి ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కుస్మున్ దొర, కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, సీడీపీఓ అనంతలక్ష్మి, కమ్యూనిటీ మొబిలైజర్స్ నాగార్జున తిరుపతిరావు, రాంబాబు పాల్గొన్నారు.

18మద్యం సీసాల పట్టివేత



పట్టుకున్న మద్యంసీసాలతో ఎస్సై ప్రశాంత్‌కుమార్

బలిజిపేట: మండలంలోని సుభద్ర గ్రామానికి చెందిన అంబటి సాంబమూర్తి అక్రమంగా విక్రయించేందుకు ఉంచిన 18మద్యం సీసాలను పట్టుకుని కేసు నమోదుచేసినట్టు ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో విడతలువిడతలుగా కొనుగోలు చేసి తన పాన్‌షాపులో వాటిని విక్రయించేందుకు ఉంచగా పట్టుకున్నట్టు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

పార్వతీపురం: సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మండలంలోని పెద బొండపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి ఆస్పత్రిలో ఉన్న మందులు, సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలే ఆస్కారం ఉందని, వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరాలు పక్కాగా జరగాలని కోరారు. గ్రామాలలో నమోదవుతున్న కేసుల వివరాలను నిశితంగా పరిశీలించి రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంపై రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో వరినారు మడుల తయారీ, యాజమాన్య పద్ధతులు, కలుపునివారణ, వరి విత్తనాల ఉత్పత్తిలోని మెలకువలను జిల్లా రిసోర్సు కేంద్ర ఏడీఏ శారద వివరించారు. వరినాట్లు వేసే వారం రోజులకు ముందు మడులలో కార్బోఫ్యూరాన్ గుళికలు వేయడం ద్వారా ఆకుముడత పురుగు, కాండంతొలుచు పురుగు రాకుండా నివారించవచ్చన్నారు. దమ్ము మడిలో ఎకరాకు 40 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకుంటే మొక్కలకు కావాల్సిన పోషకాలు అందడంతో పాటు పంట మొక్కలు ఏపుగా పెరుగుతాయన్నారు.

నేడు కడగండిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సీతంపేట: మండలంలోని కడగండి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. కార్యక్రమానికి మండల స్థాయి పార్టీ శ్రేణులు, అధికారులంతా హాజరు కావాలని ఆమె కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర



లబ్ధిదారులకు బుక్ లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు మండల కేంద్రం పాచిపెంటలో నాల్గవ రోజు గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోల బాబ్జీ, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు కూరాకుల కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త మామిడి పార్వతి, కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, కేసలి సర్పంచ్ ప్రతినిధి సతారపు రాము, స్థానిక నాయకులు మీసాల ఆదినారాయణ, మంత్రి సత్యనారాయణ, మజ్జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమం కోసం..

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైదాన ప్రాంత ప్రజలకు వైఎస్సార్ పోషణ అందిస్తే గిరిజన ప్రాంత ప్రజలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ అందిస్తున్నామని చెప్పారు. గతంలో పోషకాహారం లోపంతో గర్భిణులు, చిన్నారులు చనిపోయే పరిస్థితులు ఉండేవని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వాటి సంఖ్య పూర్తిగా తగ్గిందన్నారు. అనంతరం గర్భిణులను అక్షింతలతో ఆశీర్వదించి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎం నారాయణ, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

చరిత్రలో నిలిచిపోయే జగనన్న సురక్ష

జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం రాజన్న దొర అన్నారు. సాలూరు పట్టణంలోని తన నివాసం వద్ద గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారన్నారు. గాంధీజీ కలలగన్న గ్రామ స్వరాజ్య స్థాపన కోసం గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాలు సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సాలూరు నియోజకవర్గంలో 87సచివాలయాల పరిధిలో 47,235 సర్టిఫికెట్లు అందజేశామని వివరించారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతం చేసిన అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు జరజాపు సూర్యనారాయణ, కౌన్సిలర్‌లు గిరి రఘు, అప్పలస్వామి, గొర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష చరిత్రాత్మకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: జగనన్న సురక్ష ఓ చరిత్రాత్మక కార్యక్రమమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతమైన నేపథ్యంలో గురువారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ గ్రామ/వార్డు వలంటీర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు అంతా కలిసి ఆప్యాయంగా పలకరించి, ప్రతి గడపకు స్వయంగా వెళ్లి ప్రభుత్వ సేవలను అందుకోవడంలో వారికేమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించడం కోసం సీఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ సేవల కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు, వలంటీర్లు నేరుగా ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరించాలని సీఎం జగన్ ఆదేశించినట్లు తెలిపారు.

ప్రజల నుంచి స్పందన

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత నెల జూన్ 23న ప్రారంభించిన జగనన్న సురక్ష అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్‌లను, ఇతర సేవలను యుద్ధప్రాతిపదికన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే అందిస్తూ కొనసాగిందని తెలిపారు. జులై 1వ తేదీ నుంచి 31 వరకు అంటే మొత్తం 30 రోజుల పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజలందరి వద్ద నుంచి అపూర్వ స్పందన లభించిందన్నారు. పార్వతీపురం నియోకవర్గంలో 76 క్యాంపులు నిర్వహించి, 73,950 కుటుంబాలను సర్టిఫికెట్ల కోసం వలంటీర్లు రిజిస్టర్ చేశారన్నారు. రిజిస్టర్ చేసిన అర్జీదారులకు సర్టిఫికెట్లు జారీ చేసి 95.41 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేశామని వివరించారు.సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్/వైస్ చైర్‌పర్సన్ యిండుపూరి గున్నేశ్వర రావు, కొండపల్లి రుక్మిణి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్‌లతో పాటు మూడు మండలాల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, పాలవలస మురళీకృష్ణ, బొమ్మి రమేష్, జెడ్పీటీసీలు మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, బలగ రేవతమ్మ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఎం.భాగ్యశ్రీ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభుత్వాల సహకారంతో పామాయిల్ ప్లాంటేషన్



రైతులకు పామాయిల్ మొక్కలు పంపిణీ చేస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సత్యనారాయణ రెడ్డి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి

సీతానగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన శాఖకు కల్పిస్తున్న ప్రోత్సాహంతో పామాయిల్ ప్లాంటేషన్ విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి సత్యనారాయణరెడ్డి రైతులను కోరారు. ఈ మేరకు గురువారం మండలంలోని బగ్గందొరవలస గ్రామంలో శ్రీనివాసా పామాయిల్‌మిల్ నర్సరీలో కంపెనీ సీఈఓ మణిదీప్‌కృష్ణ ఆధ్వర్యంలో పలుగ్రామాలకు చెందిన రైతులతో మండల ఉద్యాన అధికారి ప్రత్యూష అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆగస్టు 3 న ప్రతిగ్రామంలో పామాయిల్ మొక్కల ప్లాంటేషన్ అభివృద్ధి చేయడానికి మెగా ఆయిల్‌పామ్ క్యాంపెయిన్ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించడం వల్ల ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలియజేశారు. కంపెనీ సీఈఓ మణిదీప్ కృష్ణ మాట్లాడుతూ శ్రీనివాసా పామాయిల్ మిల్ కంపెనీ రైతులకు మరింత అందుబాటులో ఉండాలనే సంకల్పంతో రాష్ట్ర రహదారిని అనుకుని చినభోగిలి వద్ద పామాయిల్ గెలల సేకరణ తూనిక కేంద్రం ఏర్పాటు చేశామని, బగ్గందొరవలసలో నర్సరీ ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన మొక్కలు స్థానికంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతులతో పామాయిల్ మొక్కల ప్లాంటేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో పార్వతీ పురం మండల ఉద్యాన అధికారి క్రాంతికుమార్, ప్లాంటేషన్ మేనేజర్ జి. వీరబాబు, బగ్గందొరవలస నర్సరీ ఇన్‌చార్జి కర్రి శ్రీనివాసరావు, పామాయిల్ రైతులు, పలుగ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ముగిసిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు



మక్కువ ప్రధానరహదారి వద్ద రాత్రివేళ వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై షైడిరాజు

మక్కువ: మావోయిస్టులు నిర్వహించిన అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. గత నెల 28వతేదీ నుంచి, ఆగస్టు 3వతేదీ వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను మావోయిస్టులు నిర్వహించారు. అప్పటినుంచి ఎస్సై జి.షైడిరాజు ఆధ్వర్యంలో పోలీసులు, ఏపీఎస్పీ బలగాలు ముమ్మరంగా వాహనతనిఖీలు నిర్వహించారు. మక్కువ మండలం సమీపంలో ఏవోబీ ఉన్నందున బలగాలు అప్రమత్తంగా వ్యవహరించాయి. గురువారం రాత్రి మక్కువ ప్రధాన రహదారి వద్ద ఎస్సై షైడిరాజు సిబ్బందితో కలిసి, ప్రతి వాహనాన్ని ఆపి నిశితంగా పరిశీలించారు. మావోయిస్టులు పిలుపునిచ్చిన సంస్మరణ వారోత్సవాలు ప్రశాంతంగా ముగియడంతో ఏజెన్సీ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత




పాలకొండ: వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు అందజేస్తున్న కౌన్సిలర్ పాపినాయుడు

పాలకొండ: నగరపంచాయతీలోని పెదకాపు వీధికి చెందిన కిల్లారి సుగుణాకర్‌రావు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను గురువారం అందజేశారు. రెండు రోజుల క్రితం సుగుణాకర్‌రావు అనారోగ్యంతో మృతి చెందగా, ఈ మేరకు ప్రభుత్వం రూ.లక్ష బీమా సదుపాయం కల్పించిందని, ప్రస్తుతం రూ.10 వేలు అందజేశామని, మిగతా మొత్తాన్ని త్వరలో అందజేస్తామని వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు తెలిపారు.

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో బాధిత కుటుంబాలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు చొప్పున అందజేశారు. ఇటీవల గ్రామానికి చెందిన మీల కిశోర్, సుంది రాంబాబు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.లక్ష బీమా పత్రం, రూ.10 వేలను ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, సర్పంచ్ టింగ శాంతికుమారి చేతులమీదుగా అందజేశారు.

7న చలో కలెక్టరేట్



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రమణారావు

పాలకొండ: మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 7వ తేదీన చేపట్టే చలో కలెక్టరేట్ కార్యక్రమంను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను అన్ని విధాలా ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

పేద పురోహితులకు అండ



సమావేశంలో మాట్లాడుతున్న అర్చక వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు యర్ల రాంబాబు శాస్త్రి

పార్వతీపురంటౌన్: పేద పురోహితులకు అండగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురోహిత అర్చక వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు యర్ల రాంబాబు శాస్త్రి అన్నారు. ఈ మేరకు పార్వతీపురంలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయం కల్యాణ మంటపంలో గురువారం జిల్లాలో ఉన్న పురోహితులు, అర్చకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్టేట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎం.డి రామకృష్ణ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల ఉన్నతికి తోడ్పడుతూ ఈ సంఘంలో సభ్యత్వం తీసుకున్న 60 సంవత్సరాలు దాటిన పేద బ్రాహ్మణ వితంతువుకు, ఒంటరి మహిళకు వృద్ధాప్య పింఛన్ రూ.2వేలు మంజూరు చేస్తామని చెప్పారు. నిరాశ్రయులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని బ్రాహ్మణ పురోహిత అర్చకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది టి.జోగారావు, ఉపాధ్యక్షుడు టి.ప్రదీప్‌కుమార్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు, బ్రాహ్మణులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు

- పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు



పాలకొండ రూరల్: డెంగీ రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పాలకొండ రూరల్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు సూచించారు. స్థానిక ఏరియా ఆస్పత్రితో పాటు పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించిన ఆయన జ్వర లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చే వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలందించాలని తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డెంగీ వ్యాధిగ్రస్తులను పరిశీలించి, ఆరోగ్యం మెరుగుపడేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే వార్డుల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 10వ తేదీన డీవార్మింగ్ డే నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు చేపట్టే మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో టీకాల కోసం గుర్తించిన గర్భిణుల వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం రేగులపాడు కేజీబీవీని సందర్శించి, వైద్య సిబ్బంది నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షలపై ఆరాతీశారు. రక్తహీనతతో బాధపడుతున్న ఐరన్ ఫోలిక్ మాత్రలు వేయించాలన్నారు. అనంతరం తంపటాపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ప్రిన్సిపాల్‌గా శంకరరావు



పైల శంకరరావు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పైల శంకరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి బదిలీపై వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లిపోవడంతో స్థానిక జూనియర్ కళాశాలలో వాణిజ్య శాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్న శంకరరావుకు ఈ అదనపు బాధ్యతలు అప్పగించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పౌర సంక్షేమ సంఘం సభ్యులు

పార్వతీపురంటౌన్: కురుస్తున్న వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ప్రజలకు వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాకల సన్యాసిరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని,మురుగు కాలువల్లో, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చేయాలని, పరిశుభ్రమైన మంచినీరు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సంచాన ఉమ, నేరడుబిల్లి గౌరి, హనుమంతు శ్రీను, అలెక్స్ పాండి, జవ్వాది పోలి, సుంకరి లక్ష్మణరావులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: చిత్తడి వర్షాల కారణంగా మండలంలో విజృంభిస్తున్న దోమల నివారణకు గ్రామాల్లో పంచాయతీ రాజ్, వైద్యారోగ్యశాఖ అధికార సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం, పెదంకలాం పీహెచ్‌సీల వైద్యాధికారులు, పంచాయతీరాజ్ సిబ్బందితో దోమల నివారణకు తీసుకోవలసిన అంశాలపై సమీక్ష చేశారు. గ్రామాల్లోని కాలువలు, పెరళ్లలో వేసిన చెత్త, ఖాళీకొబ్బరి బురికెలు, వాహనాలనుంచి తీసేసిన టైర్లను దోమలు ఆవాసంగా ఎంచుకుంటాయన్నారు. ఈ నేపథ్యంలో దోమల నివారణకు పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది ముందుజాగ్రత్త చర్యగా చెత్తను తొలగించి దూర ప్రాంతాలకు తరలించడానికి, కొబ్బరి బురికెలు, పనికి రానిటైర్లు దూరప్రాంతాల్లో ఉంచి మంట పెట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించి స్వచ్ఛమైన నీరు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిల దురాగతం



విరగ్గొట్టిన మంచినీరు ట్యాప్‌లను పరిశీలిస్తున్న హెచ్‌ఎం శ్రీదేవి

సీతానగరం: మండలంలోని కోట సీతారాంపురం పాఠశాలలో మన బడి నాడు నేడు పథకం ద్వారా నిర్మించిన మరుగుదొడ్లలో కమోడ్, వాషింగ్ బేసిన్‌లు, పైపులు, వాటర్‌ట్యాప్‌లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి విరగ్గొట్టడంతో వాటిని పునరుద్ధరించాల్సి వస్తోందని హెచ్‌ఎం సీహెచ్ శ్రీదేవి అన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పర్యవేక్షణలో లక్షలాది రూపాయల వ్యయంతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలియజేశారు.

పాఠశాలకు ప్రహరీ ఉన్నప్పటికీ రాత్రిపూట గేటు తాళం తొలగించి మరుగుదొడ్లలో మంచినీరు ట్యాప్‌లు, కుండీ వద్ద ఉన్న పైపులను తొలిగించారని, పిల్లలకు అవసరమైన మరుగుదొడ్లలో ట్యాప్‌లు విరగ్గొట్టడం సరికాదన్నారు. గ్రామపెద్దలు దృష్టి సారించి రాత్రిపూట పాఠశాలలో చొరబడిన వ్యక్తులను గుర్తించి భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరారు.

ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు పోటీ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

- 184 సీట్లకు 522 మంది విద్యార్థుల హాజరు

సీతంపేట: సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు గురువారం జరిగిన కౌన్సెలింగ్‌కు విద్యార్థులు భారీగా హాజరయ్యారు. మొదటి విడతలో 212 సీట్లకు గాను కేవలం 28 సీట్లు మాత్రమే నిండాయి. రెండో కౌన్సెలింగ్‌లో వివిధ ట్రేడ్‌లలో 184 మిగులు సీట్లు ఉండగా 522 మంది విద్యార్థులు వచ్చారు. అర్హతల ఆధారాంగా సీట్లను అధికారులు కేటాయించారు. కౌన్సెలింగ్‌లో ఐటీడీఏ ఏపీవో రోసిరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.